## క్లుప్తంగా

### నగర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

**మేయర్ కావటి**

**నెహ్రూనగర్:** గుంటూరు నగర ప్రజలకు మేయర్ నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. నగర ప్రజలందరూ సంక్రాంతి పండుగని భోగ భాగ్యాలతో, సుఖ సంతోషాలతో, కుటుంబ సభ్యులందరితో కలసి జరుపుకోవాలన్నారు. ఈ సంవత్సరం అంతా కూడా ప్రజలకు మంచి జరగాలని, అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

### స్వామి వివేకానంద స్ఫూర్తితో పనిచేయాలి



**లక్ష్మీపురం:** స్వామి వివేకానంద యువతరాన్ని స్ఫూర్తి అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విద్యావేత్త ఇ.చంద్రయ్య పేర్కొన్నారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో వివేకానంద జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. మహోన్నత ప్రాచీన భారతీయ సంస్కృతిని దేశభక్తిని జాతీయ భావాన్ని ప్రతి ఎదలో ప్రతిధ్వనించేలా చేసిన మహనీయుడు వివేకానందుడన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎస్.వి.సత్యనారాయణ, విశ్లేషకులు వీవీ రావ్, విశ్రాంత అధికారి సి.శేషగిరి రావు పాల్గొన్నారు.

### ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ




**లక్ష్మీపురం:** అఖిలభారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) 22 రాష్ట్ర మహాసభలు ఫిబ్రవరి 6 నుంచి 9వ తేదీ వరకు శ్రీకాకుళం నగరంలో నిర్వహించనున్నట్లు సంఘం కార్యదర్శి ఎస్.లెనిన్‌బాబు తెలిపారు. కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లో మహాసభల పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం దేశంలో నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో ఘోరంగా విఫలం అయిందని ఆరోపించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీని అమలు చేయకపోవడంతో దేశంలో నిరుద్యోగం రికార్డు స్థాయిలో రోజు రోజు పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ రాజ్యాంగ మార్పు కోసం కుట్ర చేస్తూ, కేంద్ర హోం శాఖ మంత్రి భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అవమానకరంగా వ్యాఖ్యలు చేయడం నిదర్శనం అన్నారు. ప్రభుత్వంతో రాయితీలు తీసుకొని కోట్లాది రూపాయలు ప్రజల సొమ్మును దోచుకుంటున్న ధనవంతుల సంపదను ప్రజలకు పంపిణీ చేయాలని నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రచార నిర్వహిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని ఫ్రీ జోన్ చేసి అక్కడ భర్తీ చేసే ఉద్యోగాల్లో 26 జిల్లాల నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 6న వేలాదిమంది నిరుద్యోగులతో ప్రదర్శన బహిరంగ సభ 7,8,9 ప్రతినిధులతో మహాసభ నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాసరజీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుభాని, జాన్సన్ బాబు, జంగాలచైతన్య, షేక్.వలి, శ్రీనివాసరావు, చల్లామరియదాసు, సాయి, యశ్వంత్ పాల్గొన్నారు.

### వ్యక్తి అదృశ్యంపై కేసు

**లక్ష్మీపురం:** ఇంట్లో నుంచి బయటకు వెళ్లి వ్యక్తి తిరిగి రాకపోవడంతో భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. కోబాల్డ్‌పేట ప్రాంతానికి చెందిన సాతులూరి క్రాంతికుమార్ ఎంఏ పూర్తి చేశాడు. విజయలక్ష్మితో వివాహం అయింది. వీరువురికి నలుగురు సంతానం ఉన్నారు. 2022 నవంబర్ 11వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన క్రాంతి కుమార్ మళ్లీ ఇంటికి తిరిగి రాలేదు. చుట్టు పక్కల వారిని, బంధువులను, సన్నిహితుల వద్ద విచారించి ఎంతకు తిరిగి రాక పోవడంతో భార్య విజయలక్ష్మి పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




# బస్టాండ్‌లో చోరీలు...

- ప్రయాణికుల జేబులు కొడుతున్న దొంగలు
- బస్టాండ్‌లో అవుట్‌పోస్ట్ ఉన్నా.. లేనట్లే...
- కేవలం కంట్రోల్ రూమ్‌కే పరిమితం అవుతున్న అధికారులు, సిబ్బంది
- ఆర్టీసీ కంట్రోలర్‌ల పర్యవేక్షణ కరువు
- బెంబేలెత్తుతున్న ప్రయాణికులు



గుంటూరు ఆర్టీసీ బస్టాండ్

**పట్నంబజారు:** గుంటూరు నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో చోరీల బెడద అధికమైంది. కేవలం రోజుల వ్యవధిలో మూడు చోరీలు చోటుచేసుకున్నాయి. ప్రయాణికుల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన పోలీసు అవుట్ పోస్ట్.. కేవలం పోలీసులకు షెల్టర్ ఇచ్చే కేంద్రంగా మాత్రమే మారింది. అక్కడ పోలీసులు ఉన్నా.. కనీసం గస్తీ నిర్వహిస్తున్న పరిస్థితులు లేవని తెలుస్తోంది.

గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో చోరీలు, ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలను నిలువరించేందుకు పోలీసు అవుట్‌పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. ఒక ఎస్ఐ, ఏఎస్ఐ, ఒక హెడ్‌కానిస్టేబుల్, ముగ్గురు హోంగార్డులతో కూడిన బృందం నిత్యం ఆర్టీసీ బస్టాండ్‌లో గస్తీ నిర్వహించాలి. అయినా అక్కడి అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో వ్యవహరించటంతో చోరీలు అధికమైపోయాయి. ఇటీవల కాలంలో ప్రకాశం జిల్లాకు చెందిన ఇద్దరూ మహిళలు పర్చూరు బస్సు ఎక్కుతుండగా, నల్లచెరువు ప్రాంతానికి చెందిన ముగ్గురు మహిళలు వారి బ్యాగులోని పర్సును కొట్టేశారు. అందులోని 13 సవర్ల బంగారు ఆభరణాలను దోచుకుని వెళ్తున్న క్రమంలో ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. అనంతరం పాతగుంటూరు పోలీసులకు అప్పజెప్పగా, వారు ఎటువంటి కేసు నమోదు చేయకుండా ఆ మహిళలను పంపించటంలో ఉన్న ఆంతర్యమేమిటో అర్థం కాని పరిస్థితి. ఈ నెల 12వ తేదీ సాయంత్రం షేక్ ఇమ్రాన్ అనే వ్యక్తి నరసరావుపేట బస్సు ఎక్కుతున్న క్రమంలో రూ.83 వేల నగదు అపహరించుకుపోయారు. గత నాలుగు రోజుల క్రితం ఒక విద్యార్థి సెల్‌ఫోన్ చోరీకి గురైంది. ఆర్టీసీ బస్టాండ్‌లోనే రవి అనే కంట్రోలర్ ఒక దొంగను పట్టుకోవటంతో.. ఎనిమిది సెల్‌ఫోన్‌లు దొరికిన ఘటన చోటు చేసుకుంది. అయితే సంక్రాంతి పండుగ కావటంతో ప్రయాణికుల తాకిడి ఆర్టీసీకి పెరిగింది. దీనితో దొంగలు సైతం వారి చేతివాటాన్ని చూపిస్తున్నారు.

**సీఐ స్పష్టంగా చెప్పినా...**

ఆర్టీసీ బస్టాండ్‌లో పండుగ సందర్భంగా అవుట్ పోస్ట్‌లో ఉన్న సిబ్బంతో పాటు మరికొంత మందిని పాతగుంటూరు పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వై.వీరసోమయ్య కేటాయించారు. స్పష్టంగా ఎటువంటి చోరీలకు ఆస్కారం ఇవ్వకుండా బాధ్యతలు విధులు నిర్వర్తించాలని సూచించారు. అవుట్‌పోస్ట్‌లో కెమెరాలు పరిశీలించటంతో పాటు, ప్లాట్‌ఫారంల వద్ద గస్తీ నిర్వహించాలని చెప్పినా, అవుట్‌పోస్ట్ అధికారులు, సిబ్బంది మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

**గస్తీకి.. సుస్తీ...**

పోలీసు అవుట్ పోస్ట్, ఆర్టీసీ సెక్యూరిటీ విభాగం, ఆర్టీసీ కంట్రోలర్స్ ఉన్నప్పటికీ చోరీల నియంత్రణ సాధ్యపడటం లేదు. పోలీసు అధికారులు, సిబ్బంది కేవలం సంతకాలు పెట్టి వారి సొంత పనులకు వెళ్తున్నారనే విమర్శలు లేకపోలేదు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం**



ఆర్టీసీ బస్టాండ్‌లో జరుగుతున్న చోరీల విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. కచ్చితంగా విధులు నిర్వర్తించే వారు బాధ్యతగా వ్యవహరించాలి. లేకుంటే శాఖపరమైన చర్యలు తప్పవు. బస్టాండ్‌లో అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించే విషయాన్ని పర్యవేక్షించి, అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– బి.జయరాంప్రసాద్, ఈస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ

**ప్రకటన చేయిస్తున్నాం..**



నిత్యం ఆర్టీసీ బస్టాండ్‌లో దొంగలు ఉన్నారు జాగ్రత్త అంటూ ప్రయాణికులకు అవగాహన కల్పించేలా చర్యలు చేపడుతున్నాం. దీనితో పాటు ఆర్టీసీ సెక్యూరిటీ, కంట్రోలర్‌ల ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. చోరీల నియంత్రణ మా వంతు కృషి చేస్తాం. కచ్చితంగా పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను విన్నవిస్తాం.

– ఎం.రవికాంత్, ఆర్ఎం, ఆర్టీసీ

### ఉత్సాహంగా భోగి మంటలు



**గుంటూరు ఎడ్యుకేషన్:** జీకేఆర్ విద్యా సంస్థలు పట్టాపురం, ఏటీ అగ్రహారం క్యాంపస్ వద్ద సోమవారం భోగి పండుగ సందర్భంగా ఉదయాన్నే భోగి మంట వేశారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల డైరెక్టర్లు జి.కొండారెడ్డి, జి.జనార్ధన్ రెడ్డి భోగి మంట ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు భోగిపండ్లు పోసి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ శైలజ, సుశీల పాల్గొన్నారు. భోగి మంటలు చుట్టూ విద్యార్థులు సంక్రాంతి పాటల ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అదే విధంగా స్వామి వివేకానంద జయంతి సందర్భంగా పట్టాభిపురంలోని ఆయన కాంస్య విగ్రహం వద్ద స్కూల్ డైరెక్టర్లతో పాటు విద్యార్థులు నివాళులర్పించారు.

### కంపెనీ సెక్రటరీ కోర్సులకు ఉజ్వల భవిష్యత్

**నెహ్రూనగర్:** ఆధునిక సమాజంలో కంపెనీ సెక్రటరీ కోర్సులు చదివే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఐసీఎస్ఐ(ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా) ఏపీ రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ ఎం వరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం బ్రాడీపేటలో ఐసీఎస్ఐ అమరావతి చాప్టర్ 10వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు చదువులు త్వరితగతిన పూర్తి చేసుకుని జీవితంలో స్థిరపడాలన్నారు. కార్యక్రమంలో ఐసీఎస్ఐ అమరావతి చాప్టర్ చైర్మన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

# విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా బిల్లుల దహనం

**సీపీఎం ఆధ్వర్యంలో నిరసన**

**లక్ష్మీపురం:** విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ బ్రాడీపేట సీపీఎం కార్యాలయం వద్ద రాష్ట్ర పార్టీ కమిటీ సభ్యులు రామారావు ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు బాదుడే బాదుడు అంటూ ప్రచారం నిర్వహించి అధికారంలోకి వచ్చిన టీడీపీ, అంతకన్నా ఎక్కువగా ప్రజలను కరెంటు చార్జీల భారం మోపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లను ప్రజలందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమిటీ జిల్లా నాయకులు కె.అజయ్ కుమార్, బి.శ్రీనివాసరావు, కళ్యాణి, ఎ.రాజేష్ పాల్గొన్నారు.

**పాతగుంటూరు బాలాజీనగర్‌లో...**

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ పాత గుంటూరు బాలాజీ నగర్ మొదటి లైన్‌లో భోగిమంటలలో విద్యుత్ విద్యుత్ బిల్లులు దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలల సమయంలోనే రూ.16 వేల కోట్లు ప్రజలపై భారాలు మోపిందన్నారు. తక్షణమే సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శంకర్, సుధీర్, మునగాల రాహుల్, కిరణ్, యుగంధర్ పాల్గొన్నారు.

**ప్రగతి నగర్‌లో...**

ప్రగతినగర్‌లో సీపీఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్కరణల్లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై విద్యుత్ భారాలు మోపుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.ముత్యాలరావు, కాకుమాను నాగేశ్వరరావు, స్థానిక ప్రజలు చందు పవన్‌కుమార్, దేరంగుల నాగేశ్వర రావు, గుంజి వెంకటేశ్వర్లు, గుంజి లక్ష్మి, తేరేజమ్మ, వెంకన్నబాబు పాల్గొన్నారు.

**పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లో..**

సీపీఎం పిలుపులో భాగంగా విద్యుత్ బిల్లులను సోమవారం దహనం చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి.లక్ష్మణ రావు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు ఉండవని చెప్పి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేద బడుగు బలహీన వర్గాల వారికి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే పనిలో నిమగ్నం అయ్యారన్నారు. కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు షేక్ ఖాశిం షహీద్, స్థానిక శాఖ కార్యదర్శి జి.లూథర్ పాల్, ఆది నికల్సన్, షేక్ మస్తాన్ వలి, ఎస్.పద్మనాభుడు, షేక్ నూర్జహాన్, పి.ఆది లక్ష్మి పాల్గొన్నారు.


బ్రాడీపేట సీపీఎం కార్యాలయం వద్ద భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న పార్టీ నాయకులు


ప్రగతి నగర్‌లో..


పాతగుంటూరు బాలజీనగర్‌లో..

### ఎన్టీఆర్ స్టేడియంలో సంక్రాంతి సంబరాలు


దప్పు వాయిద్యంలో పాల్గొన్న కళాకారులు

**నెహ్రూనగర్:** నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో సంక్రాంతి వేడుకలు సందడిగా నిర్వహిస్తున్నారు. సోమవారం భోగి పండుగను పురస్కరించుకుని పూర్ణ కుంభ స్వాగతం, సన్నాయి మేళతాళాలు, భోగి మంటలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల ఆటపాటలు, చిన్నారులకు భోగిపళ్లతో స్టేడియం అంతా పండుగ శోభ నెలకొంది. సంప్రదాయ వస్త్రాలు ధరించి ప్రజలు తరలివచ్చారు. అనంతరం నగరపాలక సంస్థ సిబ్బందికి, యునైటెడ్ వర్కింగ్ జర్నలిస్టులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. సాయంత్రం వేళ డప్పు వాయిద్యం, తంబోలా, సంప్రదాయ వస్త్ర పోటీలు, చెక్క భజన, కూచిపూడి, ఫోక్ డ్యాన్స్ ప్రదర్శనలు జరిగాయి.

# కనుల పండువగా గోదాదేవి కల్యాణం

**గుంటూరు ఎడ్యుకేషన్:** సంగడిగుంటలోని మంత్రి వారి వీధిలోని అయ్యప్ప రెసిడెన్సీలో సోమవారం గోదా సమేత వేణుగోపాల స్వామి కల్యాణోత్సవాన్ని వేద పండితులు తాతాచార్యుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొలుత విగ్రహాలను మేళ, తాళాలతో సంగడిగుంట పురవీధుల్లో ఊరేగించారు. తాతాచార్యులు గోదా కళ్యాణం యొక్క విశిష్టతను తెలియజేస్తూ, గోదాదేవి అకుంఠిత దీక్షతో అద్భుతమైన వ్రతాన్ని ఆచరించి, భగవంతుని ఎలా ప్రసన్నం చేసుకోవాలో తన ఆచరణతో చూపించిందని అన్నారు. చిన్నారులు గోదాదేవి అలంకరణలతో అలరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, కళ్యాణాన్ని తిలకించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మద్ది రవికుమార్, పవన్, నాగరాజు, అనిల్, రాము, జయసుధ, సునీత, సత్య, విజయ, సురేష్, మహంకాళి శ్రీనివాసరావు, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

**ఆర్.అగ్రహారంలో..**

**నగరంపాలెం:** స్థానిక ఆర్.అగ్రహారంలో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం భోగి పండుగ సందర్భంగా శ్రీగోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం అత్యంత రమణీయంగా నిర్వహించారు. విశేష సంఖ్యలో దంపతులు హాజరై మహోత్సవంలో పాల్గొనగా, అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

**గౌరీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో...**

స్థానిక బ్రాడీపేట 2/7వ అడ్డరోడ్డులోని శ్రీగౌరీవిశ్వేశ్వరస్వామి దేవాలయంలో స్వామి జన్మ నక్షత్రం సందర్భంగా సోమవారం సాయంత్రం కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూర్తులకు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. నల్లమేకల శ్రీనివాసరావు, నాగ మల్లేశ్వరి దంపతులతో అర్చక స్వామి విశ్వేశ్వరశర్మ కల్యాణాన్ని జరిపించారు. దేవాలయ అర్చకులు జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్‌శర్మ, గిరిధర్, వాసు తదితరులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు.

**కృష్ణనగర్‌లో..**

స్థానిక కృష్ణనగర్ ఒకటో వీధిలోని శ్రీగోదా పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం భోగి సందర్భంగా శ్రీగోదా రంగనాథుల కల్యాణం వైభవంగా వేదమంత్రాల నడుమ జరిగింది. విశేష హారతి అనంతరం భక్తులకు అన్నసమారాధన జరగ్గా, ధనకుదరం శ్రీనివాసాచార్యుల పర్యవేక్షణలో నిర్వహించారు.

**లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో..**

స్థానిక కృష్ణనగర్‌లో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో శ్రీ గోదారంగనాథుల కళ్యాణం కనుల పండువగా నిర్వహించారు. విశేష హారతి అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.


సంగడిగుంటలో కల్యాణంలో పాల్గొన్న దంపతులు


మంగళ సూత్రం చూపుతూ..


గోదా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో తాళిబొట్టు చూపుతూ..


శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో..

### ముగిసిన చండీయాగం



**నగరంపాలెం:** స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భోగి సందర్భంగా సోమవారం శ్రీకృష్ణుని ప్రత్యేకంగా అలంకరించారు. డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి చిన్నారులకు భోగి పండ్లను పోసి వేడుకగా నిర్వహించారు. అన్నమయ్య కళావేదిక్పై టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్ సౌజన్యంతో గత ముప్పై రోజులు నిర్వహించిన తిరుప్పావై ముగిసింది. అనంతరం కోగంటి వెంకట శ్రీరంగ నాయకిని బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ, ఆలయ పాలకమండలి సత్కరించారు. వైభవంగా గోదారంగనాయక స్వామి కల్యాణోత్సవం జరగ్గా, వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాలతో వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా గోదాదేవి కల్యాణం చేపట్టారు.

**పూర్ణాహుతితో..**

భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో ధార్మిక ప్రాంగణంలో గత పదహారు రోజులుగా నిర్వహిస్తున్న బృహత్తర చండీయాగం సోమవారం ముగిసింది.

### టీటీడీని ప్రక్షాళన చేయాలి

**గుంటూరు ఎడ్యుకేషన్:** తిరుమల వైకుంఠ ద్వార దర్శన టికెట్ల కోసం చోటుచేసుకున్న తొక్కిసలాటపై విచారణ చేపట్టాలని హైకోర్టు న్యాయవాది, కృష్ణా- గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గుమ్మా శ్రీనివాస్ యాదవ్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. స్వామి వారి దర్శనం కోసం లక్షలాదిగా భక్తులు వస్తారని ముందుగానే అంచనా ఉన్నా టీటీడీ పాలకమండలి, అధికారులు నిర్లక్ష్యంగా ఉండడం వలన ఈ ఘటన జరిగిందని పేర్కొన్నారు. నైతిక బాధ్యత వహిస్తూ టీటీడీ చైర్మన్ వెంటనే రాజీనామా చేయాలని, సంఘటన అనంతరం బీఆర్ నాయుడు చేసిన వ్యాఖ్యలు, ఇచ్చిన స్టేట్మెంట్ ను పరిగణలోకి తీసుకుని ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీటీడీ బోర్డులో శాశ్వత సభ్యుడు హోదాలో సన్నిధి గొల్ల(యాదవులు), అర్చకులు, జీయర్ కుటుంబాలలో ఒకరు చొప్పున ఉండాలని డిమాండ్ చేశారు.

### సంస్కృతిని కాపాడుకుందాం

**లక్ష్మీపురం:** సంక్రాంతి వంటి మన సంస్కృతిని ప్రతిబింబించే పండుగలను కాపాడుకోవాల్సిందే అని విశ్వశాంతి ఆర్ట్ అకాడమీ అధ్యక్షుడు రత్నారెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాయకుడు బాబు మాట్లాడారు.

### నేడు అయ్యప్ప స్వామి జ్యోతి కార్యక్రమం

**నగరంపాలెం:** శ్రీ వాసవి మణికంఠ సేవా భక్త బృందం ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరుబజార్ కోదండరామ మందిరం వద్ద మకర సంక్రాంతి సందర్భంగా అయ్యప్ప స్వామి జ్యోతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు స్వామి జ్యోతి కార్యక్రమం మొదలవుతుందని, భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.













